# దైవప్రేమ నిమిత్తం మీ జీవితాన్ని ధారపోయండి

(ఆధ్యాత్మికరంగములో సుప్రసిద్ధులైన సంత్ ఆసారామ్ బాపు 2004 సెప్టెంబరు 14వ తేదీన శ్రీవారి దర్శనార్థం ప్రశాంతినిలయానికి విచ్చేయటం జరిగింది. 15వ తేదీ మధ్యాహ్నం ఆయన సాయికుల్వంత్ సభామండపంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ సందర్భమును పురస్కరించుకొని భగవాన్ అనుగ్రహించిన దివ్య సందేశము)

ప్రేమస్వరూపులారా!

తపస్సు, దానధర్మములు చేసినంత మాత్రమున, జగత్తులో నలుమూలలా సంచరిస్తూ శాస్త్రములను గురించి ప్రచార, ప్రబోధలు సల్పినంత మాత్రమున దైవకృప, దైవప్రేమ లభ్యం కావు. సత్పురుషుల యొక్క సేవలు సల్పాలి. సేవలు చేయక ఎన్ని సాధనలు చేసినప్పటికీ అవి సిద్ధించవు. మహనీయుల దర్శన, స్పర్శన, సంభాషణలచేతనే భారతీయులు ఎంతోమంది కృతార్థులైనారు. ఈయన (సంత్ ఆసారామ్ బాపు) గుజరాత్ నుండి ఎంతో శ్రమపడి ఈనాడిక్కడికి వచ్చి మన విద్యార్థులకు చక్కని ఉపదేశము సల్పినాడు. ఇది నిజంగా విద్యార్థుల అదృష్టము. అతని హృదయము చాలా చల్లనైనటు వంటిది. కలిప్రభావముచేత భక్తిశ్రద్ధలు నశించి, నాస్తికత్వము పెరిగిపోతున్న ఈ తరుణంలో విద్యార్థులకు ఇలాంటి బోధనలు చాలా అవసరము. మహనీయులను దర్శించినంత మాత్రమున మన మనోభీష్టము నెరవేరదు. కేవలం స్పర్శించటం వలన కూడా మన అభీష్టము నెరవేరదు. దర్శన, స్పర్శన, సంభాషణలు మూడింటివల్లనే మానవుని హృదయం పరిపక్వమై శాంతినొందుతుంది. మానవుడు తరించుటకు నవవిధ భక్తిమార్గములున్నాయి:

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనం

శ్రవణ, మనన, నిదిధ్యాసములచేత మానవుడు తన జన్మను సార్థకం గావించుకోవాలి. ఈనాటి పిల్లలు మహా తెలివితేటలు గలవారు. తమ తెలివితేటలను సద్వియోగపరచుకున్నప్పుడే వారు తమ జన్మను సార్థకం చేసుకున్నవారవుతారు. జన్మ సార్థకం చేసుకోవడానికి ఆధ్యాత్మికమే తగిన మార్గము. కాని, విద్యార్థులు తమ తెలివితేటలను పెడమార్గం పట్టించి, వాదోప వాదములచేత కాలమును వ్యర్థం గావించుకుంటున్నారు. విద్యార్థులారా! విద్య అనగా కేవలం గ్రంథపరిచయం కాదు. మీరు విద్య నిమిత్తం అనేక పాట్లు పడుతున్నారు; ఏవో కొన్ని గ్రంథములు చదివి పరీక్షలలో ఉత్తీర్ణులవుతున్నారు. కాని, అవన్నీ కేవలం నెగెటివ్ విద్యలు. మనకు పాజిటివ్ విద్య కావాలి. ప్రేమ, దయ, సహనము, సానుభూతి ఇత్యాది సద్గుణములు మనలో ఎన్నియో ఉన్నవి. సరియైన అభ్యాసములచేత వాటిని పోషించుకోవాలి. ఎందరో పెద్దలు ఇలాంటి మార్గమును అనుసరించి తరించారు.

## మనస్సు ఒక్క ప్రేమకు తప్ప మరి దేనికీ లొంగదు

దైవానుగ్రహము ఒక్క ప్రేమకు మాత్రమే లభ్యమౌతుందిగాని, మరొక మార్గములో లభ్యము కాదు. ప్రేమమార్గము ఒక్కటే భగవదనుగ్రహము పొందటానికి రాజమార్గమనే విశ్వాసము విద్యార్థులలో అభివృద్ధి కావాలి. ప్రేమచేతనే మనస్సును జయించవచ్చును. ప్రేమచేతనే ప్రకృతిని స్వాధీనపరచుకొనవచ్చును. ప్రేమచేతనే ఆధ్యాత్మిక సాధన సఫల మవుతుంది. మానవునియందున్న తరగని ఆస్తి, తరగని శక్తి ఒక్క ప్రేమ మాత్రమే. ఎంతమందికి పంచినప్పటికీ ప్రేమ పెరుగుతూనే ఉంటుంది. ప్రాకృతమైన ప్రేమ కాదది; పరార్థసంబంధమైన ప్రేమ. మన తల్లిదండ్రులను మనం ప్రేమించినట్లుగా దైవాన్ని ప్రేమిస్తూ రావాలి. సాటి మానవులను మన సోదర సోదరీమణులుగా భావించి ప్రేమించాలి. ఇట్టి ప్రేమచేతనే జగత్తును ఏక కుటుంబముగా మార్చవచ్చును. ఈ ప్రపంచమునంతా ఏకం చేయాలంటే ఒక్క ప్రేమమార్గములో తప్ప

అన్యమార్గములో సాధ్యం కాదు. మానవుని మనస్సును మార్చవలెనంటే ఒక్క ప్రేమచేతనే మార్చాలి. మనస్సు చాలా చంచలమైనది, చాలా శక్తి కలిగినది. ప్రేమకు తప్ప మరి దేనికీ అది లొంగదు. ఒక్క ప్రేమచేతనే మనస్సు మనకు స్వాధీనమవుతుంది.

సర్వేశుప్రేమ సర్వచింతలను పరిహారం గావిస్తుంది

విద్యార్థులారా! మీ ప్రేమను కేవలం దైవము నిమిత్తమై ధారపోయండి. చదువుల నిమిత్తమై ప్రేమను ధారపోసినవారు లోకములో ఎందరో ఉన్నారు. కాని, వారేమైనా దైవాన్ని పొందగలిగినారా? లేదు, లేదు. ప్రేమతో, ఏకాగ్ర చిత్తముతో దైవచింతన చేసినప్పుడే మీరు దైవమును పొందగలరనే సత్యాన్ని గుర్తించి వర్తించండి. మీరు ఎన్ని చదువులైనా చదువవచ్చు; ఎన్ని శాస్త్రములైనా పఠించవచ్చు. కాని, దైవము ఒక్క ప్రేమ శాస్త్రమునకు తప్ప అన్యశాస్త్రములకు లభ్యం కాదనే సత్యాన్ని గుర్తించండి. ప్రేమకు భగవంతుడు చాలా సులభంగా వశుడవుతాడు. కనుక ప్రేమచేత మీరు దైవాన్ని పొందండి. ఈ ప్రపంచంలో అన్నీ చింతలే!

*పుట్టుటయే చింత భూమినుండుట చింత*
*సంసారమొక చింత చావు చింత*
*బాల్యమంతయు చింత వార్థక్యమొక చింత*
*జీవించుటొక చింత చెడుపు చింత*
*కర్మలన్నియు చింత కష్టంబులొక చింత*
*సంతసమొక చింత వింత చింత*
*సర్వ చింతలు బాపెడు సాయి భక్తి*
*గొనుడు యికనైన జనులార కోర్కె మీర*
*ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు*
*సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!*

సర్వేశ్వరుని ప్రేమను మీరు సాధించినారంటే సర్వచింతలూ పరిహారమైపోతాయి. భౌతికమైన విద్యలు నేర్చుకోండి, తప్పు లేదు. కానీ శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన దైవప్రేమను పొందుటకై మీ జీవితాన్ని ధారపోయండి. ఎందరో పెద్దలు ప్రపంచమంతటా సంచరించి వారి ప్రబోధలచేత జగత్తునెంతో ఉద్ధరిస్తూ వచ్చారు. అటువంటి మహా పురుషులే లేకపోతే మన భారతదేశము ఇంకే గతి పట్టియుండెడిదో! కనుక, మీరు పెద్దలను అనుసరించాలి. గర్వము ఏమాత్రము పనికిరాదు. గర్వము మిమ్మల్ని అధఃపతనం గావిస్తుంది.

ప్రేమచేతనే మీరు అధికులవుతారు. కనుక, ప్రేమను అభివృద్ధి పరచుకొని వినయ, భయ, విశ్వాసాలచేత దైవానుగ్రహాన్ని సాధించి తరించటానికి కృషి చేయండి. మానవుడు తరించుటకు ప్రేమమార్గమే శరణ్యం. పెద్దలందరుకూడను ప్రేమద్వారానే తమ జీవితగమ్యం చేరుకున్నారు. కనుక, మీరు ప్రేమను మాత్రమే మీ ప్రధానమైన లక్ష్యంగా తీసుకోండి. ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. Live in love. ఇదియే మీరు నేర్చుకోవలసినది.